సాక్షి సిద్దిపేట

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



ఎన్నాళ్లీ ముంపు

మంజీరా బ్యాక్ వాటర్‌తో పంటలు నీట మునుగుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వివరాలు 10లో ▸



కులగణన ప్రకారం..

స్థానిక ఎన్నికల్లో గుల గణన ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని గిరిజన నేతలు డిమాండ్ చేశారు.

వివరాలు 10లో ▸



ఆదాయ మార్గాలపై అన్వేషణ

మున్సిపల్‌కు వచ్చే వనరులే కాకుండా అదనపు ఆదాయ మార్గాల వైపు మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

పంటల నమోదు తప్పనిసరి



ఆగ్రో సేవా కేంద్రంలో ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

నంగునూరు(సిద్దిపేట): రైతులు సాగు చేసిన పంట వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి అన్నారు. నంగునూరులోని రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని మంగళవారం ఏఓ గీతతో కలసి గోదాం, రిజిష్టర్లు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎరువులు అమ్మిన వెంటనే రిజిష్టర్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం ఘణపూర్‌లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ పంట అమ్ముకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే పంట నమోదు తప్పనిసరన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం


డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుర్రం ఎల్లం తన కార్యకర్తలతో కలిసి మంగళవారం నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని చూసి, కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బురుజుకు పునరుజ్జీవం



బురుజుపై పెరిగిన మొక్కలు తొలగిస్తున్న యువకులు

నంగునూరు(సిద్దిపేట): చారిత్రక ఆనవాళ్లు కనుమరుగవుతున్న తరుణంలో వాటిని కాపాడేందుకు యువకులు ముందుకొచ్చారు. నంగునూరు మండలం మగ్దుంపూర్‌లో మంగళవారం యువకులు శ్రమదానం చేసి బురుజుపై పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించి దసరా ఉత్సవాలను సిద్ధం చేశారు.

నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని సీఐ వాసుదేవరావు అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో నార్కోటిక్ డాగ్స్‌తో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు కలిగిన చాక్లెట్స్ ఎవరైనా కలిగి ఉన్నా, విక్రయించినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరికైనా సమాచారం ఉంటే 100కు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు.

శ్రీదుర్గే.. జయదుర్గే



దుర్గాదేవిగా వర్గల్ అమ్మవారి దివ్యదర్శనం

వర్గల్(గజ్వేల్): శరన్నవరాత్రి ఉత్సవ వైభవంతో వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం అలరారుతోంది. మంగళవారం అమ్మవారు సకల సద్గతులు ప్రాప్తించే దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచహారతులు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. చదువుల తల్లి సన్నిధిలో చిన్నారుల అక్షరస్వీకారాల సందడి నెలకొంది.

కనకదుర్గ మాతగా..

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో గల విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం తొమ్మిద రోజున అమ్మవారు కనకదుర్గ దేవిగా దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తరించారు.



మర్పడ్గలో కనకదుర్గ మాతగా విజయదుర్గ

ప్రభుత్వాస్పత్రిలో ఆయుధ పూజ



పూజలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సిద్దిపేటకమాన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో దసరా పండుగను పురస్కరించుకుని వైద్యులు, సిబ్బంది మంగళవారం ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, పిడియాట్రిక్ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్‌బాబు వైద్యులు, సిబ్బందితో పాటు ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అనస్తీషియా విభాగ హెచ్‌ఓడీ చందర్, వైద్యులు రాగిణి, రమ్య, రవి, గ్రీష్మ, సునీత, మహేందర్, సౌజన్య, ప్రవీణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక బరి.. నేతల గురి

ఊరూరా స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. బరిలో నిలిచే ఆశావహులు ముమ్మరంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆయా సంఘాల నేతలను కలిసి మద్దతు కూడగడుతున్నారు. ఇప్పటికే గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఏఏ విడతల్లో జరగనున్నాయో తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 508 గ్రామ పంచాయతీలు, 4,508 వార్డులు, జెడ్పీటీసీలు 26, ఎంపీటీలు 230 ఉన్నాయి. ఏ మండలం ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయోనని ఆశావహులు ఆసక్తిగా ఉన్నారు. బరిలో నిలిచే నేతలు కసరత్తు షూరు చేశారు. జిల్లాలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు రెండు విడతల్లో, గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి.

– సాక్షి, సిద్దిపేట

ఏర్పాట్లలో ఆశావహులు

- రెండు విడతల్లో పరిషత్ ఎన్నికలు
- పరిషత్ మొదటి విడతలో 15 మండలాలు
- మూడు విడతలుగా పంచాయతీ పోలింగ్
- మొదటగా 7 మండలాలు, రెండోసారి 10, మూడో విడతలో 9 మండలాలు

ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో జిల్లాలో ఎటు చూసినా ఎన్నికల సందడే కనిపిస్తోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్నాయి.

- మొదటి విడతలో 15 మండలాల్లో 15 జెడ్పీటీసీలు, 125 ఎంపీటీసీ స్థానాలకు అక్టోబర్ 23న ఎన్నికలు జరగనున్నాయి. సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, నారాయణరావు పేట, చిన్నకోడూరు. నంగునూరు, దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట, చేర్యాల, కొమురవెల్లి, రాయపోలు, దూల్మిట్ట, మద్దూరు మండలాలు ఉన్నాయి.

రెండవ విడతలో 11 మండలాల్లో 11 జెడ్పీటీసీలు, 105 ఎంపీటీసీలకు ఎన్నికలు అక్టోబర్ 27న జరగనున్నాయి. గజ్వేల్, కొండపాక, కుకునూరుపల్లి, జగదేవ్‌పూర్, ములుగు, వర్గల్, మర్కూక్, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలున్నాయి.



పట్టు కోసం కసరత్తు

బరిలో నిలిచే ఆశావహులు ముమ్మరంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏ విడతలో ఏ గ్రామంలో ఎన్నికలు జరగనున్నాయో తేలడంతో ఆశావహులు ఇప్పటికే కార్యకర్తలు, యువజన, మహిళా, కుల సంఘాల నేతలతో సమావేశాలవుతున్నారు. తనకు మద్దతు తెలిపి గెలిపించాలని ప్రాధేయపడుతున్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు ఇప్పటికే పల్లెలో తిరుగుతూ పట్టును మరింత పెంచుకుంటున్నారు. పల్లెల్లో సందడి నెలకొంది.

బీసీలు అధికం.. ఎస్టీలు అత్యల్పం

ఎస్టీ ఓటర్లు	20,680
ఎస్సీ ఓటర్లు	1,32,794
బీసీలు	4,21,575
ఇతరులు(ఓసీ, ముస్లిం)	80,909
మొత్తం ఓటర్లు	6,55,958

మూడు విడతల్లో 'పంచాయతీ'

- గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. మొదటి విడతలో 7 మండలాలు, 163 గ్రామ పంచాయతీలు, 1,432 వార్డుల్లో అక్టోబర్ 31న ఎన్నికలు జరగనున్నాయి. గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కూక్, ములుగు, వర్గల్, రాయపోల్, దౌల్తాబాద్ మండలాలున్నాయి.
- రెండో విడతలో 10 మండలాలు 182 గ్రామ పంచాయతీలు, 1,644 వార్డులలో ఎన్నికలు నవంబర్ 4న నిర్వహించనున్నారు. నంగునూరు, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, నారాయణరావుపేట, మిరుదొడ్డి, బెజ్జంకి, తొగుట, అక్బర్‌పేట-భూంపల్లి, దుబ్బాక మండలాలు ఉన్నాయి.
- మూడో విడతలో 9 మండలాలు 163 గ్రామ పంచాయతీలు, 1,432 వార్డుల్లో నవంబర్ 8వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. హుస్నాబాద్, అక్కన్నపేట, దూల్మిట్ట, కోహెడ, మద్దూరు, కొమురవెల్లి, కొండపాక, కుకునూరుపల్లి, చేర్యాల మండలాలున్నాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- పటిష్ట కార్యాచరణతో ముందుకు
- కలెక్టర్ హైమావతి

సిద్దిపేటరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ, అదనపు డీసీపీ, డీపీఓలతో కలిసి కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ల స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనలు, విధులపై అధికారులకు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు.

నిబంధనలు పాటించాలి...

ఎన్నికల్లో పాల్గొనే సిబ్బంది నిబంధనలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణకు 15 కమిటీలను ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జెడ్పీ సీఈఓ రమేష్, డీపీఓ దేవకిదేవి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుషాల్కర్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల హెల్ప్‌డెస్క్ ప్రారంభం

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల హెల్ప్ డెస్క్‌ను గరీమా అగర్వాల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వ హిస్తున్నామన్నారు. ఓటర్లను మభ్యపెట్టాలని చూసినా, భయభ్రాంతులకు గురి చేసినా, ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా హెల్ప్ డెస్క్ నం. 08457–230000కు ఫోన్ చేసి తెలపాలన్నారు.



హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

గజ్వేల్‌లో నేడు సద్దుల బతుకమ్మ

ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ, మున్సిపల్ కమిషనర్

గజ్వేల్: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊరచెరువు వద్ద స్థానిక ఏసీపీ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా చెరువుల వద్ద అవసరమైన బారికేడ్లు, లైటింగ్, వేదిక ఏర్పాటు తదితర అంశాలపై కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేసి ఆ ప్రదేశంలోనే వాహనాలు నిలిపేలా చూడాలని పోలీసులకు ఆదేశాలివ్వనున్నట్లు ఏసీపీ తెలిపారు. రోడ్డుపై రద్దీ ఉండే అవకాశమున్నందువల్ల స్టాపర్లను ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా ఎలాంటి ఈవ్‌టీజింగ్ జగరకుండా మఫ్టీలో పోలీసుల నిఘా కొనసాగుతోందన్నారు. అలాగే దసరా పండుగ రోజు మహంకాళీ ఆలయం వద్ద నిర్వహించనున్న రావణ దహనం, ఇతర ఏర్పాట్లను సైతం ఏసీపీ పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాండవుల చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ, కమిషనర్

కాంగ్రెస్ బాకీపై ప్రజాచైతన్యం

- ప్రభుత్వ తీరుపై ఇంటింటా వివరిద్దాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: కల్లబొల్లి మాటలు, ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసంపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలని, అందుకు ప్రజా చైతన్యానికి శ్రేణులు సంసిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి బాకీ పడిన పథకాలతో రూపొందించిన బాకీ కార్డును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గడపకు క్యాడర్ వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేసిన దగా గురించి వివరించాలన్నారు. కాంగ్రెస్ పాలనను ఎండగట్టి ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దసరా పండుగ సందర్భంగా సుదూర ప్రాంతాల్లో ఉండే వారంతా సొంత పల్లెలకు వస్తారని, ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామాల్లో క్యాడర్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. తాను కూడా నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో ఇంటింటికి వస్తానని, అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, రాజనర్స్ భుపేష్, మణిక్యారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సాయిరాం, శ్రీనివాసరావు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



రేణుకా ఎల్లమ్మ ఆలయంలో హరీశ్

హరీశ్‌రావు పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ, కొండ మైసమ్మ ఆలయాలలో మంగళవారం ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయాలలో ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ఆశీర్వచనలు, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డి పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ కోటయ్య తల్లి మృతి చెందడంతో కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. కోటయ్య తల్లి భారతమ్మ మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ ప్రతినిధులు ఉన్నారు.

యూకేలో పేరిణి సంతోష్ నృత్య ప్రదర్శనలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇంగ్లండ్‌లో యూనైటెడ్ కింగ్‌డమ్ (యూకే) తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో పేరిణి నృత్య ప్రదర్శనలు ఇస్తున్నట్లు జిల్లాకు చెందిన ప్రముఖ పేరిణి నాట్యాచార్యుడు, యువకళా రత్న సంతోష్ మంగళవారం తెలిపారు. లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం నృత్య రూపకం, పేరిణి శివతాండవం నృత్య ప్రదర్శనలు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే నెల రోజుల్లో ఐర్లాండ్, స్కాట్‌లాండ్, జర్మనీ, నెదర్లాండ్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లలో ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పేరిణి నృత్యంను విదేశీయులు ఇష్టపడుతున్నట్లు సంతోష్ తెలిపారు.



నాట్యాచార్యుడు సంతోష్

యాసంగిపైనే ఆశలు

- సాగు అంచనా.. 4.12లక్షల ఎకరాలు
- వానాకాలం పంటలకు అతివృష్టి దెబ్బ

రాబోయే యాసంగి సీజన్‌లో 4.12లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి రావొచ్చని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. వానాకాలంలో అతివృష్టి కారణంగా తీవ్రమైన పంట నష్టానికి గురైన రైతులు యాసంగిపై ఆశలు పెట్టుకున్నారు. ఈ సీజన్‌లోనైనా ఊరట పొందాలనే ఆశావహదృక్పథంతో ఉన్నారు.

– గజ్వేల్

యాసంగి సీజన్ సాగుకు సంబంధించి వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. మొత్తంగా 4.12లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. వరి 3,64,823 ఎకరాల్లో, 31,416 ఎకరాల్లో మొక్కజొన్న, 12,609 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, 455ఎకరాల్లో వేరుశనగ, 579ఎకరాల్లో శనగలు, 54ఎకరాల్లో పత్తి, 968ఎకరాల్లో స్వీట్‌కార్న్ సాగులోకి వచ్చే అవకాశం ఉంది. మిగతా విస్తీర్ణంలో ఇతర పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. సాధారణంగా మొక్కజొన్న కోత తర్వాత దాని స్థానంలో అక్టోబర్ రెండో వారం నుంచి పొద్దు తిరుగుడు, శనగలు ఇతర ఆరుతడి పంటలు విత్తుతారు. గతంలో శనగ, పొద్దుతిరుగుడు విత్తనాలు సబ్సిడీపై ఇచ్చేవారు. కానీ కొన్నేళ్లుగా సబ్సిడీ ఊసే లేకపోవడం వల్ల శనగ పంట సాగు భారీగా పడిపోయింది. ఇదిలావుంటే వానాకాలం సీజన్‌లో అతివృష్టి కారణంగా పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం సంభవించింది. ఈ కారణంగా పంటల్లో ఎదుగుదల లోపించి ఎక్కడికక్కడా తెగుళ్ల దాడి చేశాయి. ప్రస్తుతం ఈ పంటలను తొలగించి పొద్దు తిరుగుడు, శనగ ఇతర ఆరుతడి పంటలతో ఉపశమనం పొందాలనుకుంటున్నారు. కానీ విత్తన సబ్సిడీ లేకపోవడం కలవరపరుస్తోంది.

ఇతర పంటలదీ అదే పరిస్థితి...

మొక్కజొన్న 31,416వేల ఎకరాల వరకు సాగులోకి వచ్చే అవకాశం ఉండగా 4,200 క్వింటాళ్ల విత్తనం అవసరం. పొద్దు తిరుగుడు 12,609 ఎకరాల్లో సాగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు 2,300 క్వింటాళ్ల విత్తనం, వేరుశనగ 579 ఎకరాల్లో సాగులోకి రానుండగా.. 100క్వింటాళ్లకుపైగా విత్తనం అవసరం ఉంటుంది.

యూరియా కొరత తీరేనా?

వానాకాలంలో యూరియా దొరక్క తీవ్ర పంట నష్టానికి గురైన రైతులు యాసంగి సీజన్‌లోనూ యూరియా తీరుతుందా లేదా? అనే ఆందోళనలో ఉన్నారు. యాసంగి సీజన్ పూర్తయ్యేంతవరకు సుమారుగా 25వేల మెట్రిక్ టన్నులకుపైగా యూరియా అవసరముంటుందని అంచనా. కానీ అవసరం మేరకు నిల్వలు వస్తాయా? అనేది అనుమానంగా ఉంది. ఈ పరిస్థితి వల్ల రైతులు పంటల సాగును తగ్గించుకునే అవకాశం కూడా ఉన్నది. ఈ విషయంలో వ్యవసాయశాఖ రైతుల్లో నమ్మకం పెంపొందిస్తే తప్పా పరిస్థితిలో మార్పు ఉండకపోవచ్చు. మరోవైపు నానో యూరియా వాడకం పెంచేలా ప్రత్యేక కార్యాచరణ అమలుచేయాలని కూడా భావిస్తున్నది. కానీ ఈ ప్రయత్నం ఏమేరకు ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.



యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతు

ప్రణాళిక సిద్ధం



యాసంగి సాగుకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేశాం. రైతుల అవసరం మేరకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉండేలా చూస్తాం. గతంలో మాదిరిగానే ఈసారి వరి అత్యధికంగా సాగులోకి వచ్చే అవకాశం ఉంది.

– స్వరూపరాణి, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

బగలాముఖీ శక్తిపీఠంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ శక్తిపీఠంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రదోష పూజ, మహా మంగళ నీరాజనం నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగలాముఖీ వ్రత సంకల్ప పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పురోహితుడు వామనశర్మ, ఆలయ భూ దాత పబ్బ రమేశ్ గుప్తా, నాయకులు మన్సూర్, యాదగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, మైపాల్ రెడ్డి, లాయక్, లక్ష్మణ్, భిక్షపతిరెడ్డి, కల్లూరి వెంకటేశ్, ముత్యంరెడ్డి, అశోక్, నర్సయ్య ఉన్నారు.

బస్టాండ్ ఎదుట నిలిచిన మురుగు?



బస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగునీరు

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌లో చేపట్టిన హైవే రోడ్డు పనుల కారణంగా బస్టాండ్ ఆవరణలో గుంత ఏర్పడి మురుగునీరు నిలిచింది. దీంతో బస్టాండ్‌లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా మురుగునీటి నుంచి దుర్వాసన వస్తుందని, దోమలు వృద్ధి చెందే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగునీటిని తొలగించాలని కోరుతున్నారు.

కళాశాలలో ప్రవేశానికి గడువు పెంపు

నర్సాపూర్ రూరల్: అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ కళాశాల ప్రవేశానికి అక్టోబర్ 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.హుస్సేన్, కోఆర్డినేటర్ హేమంత్ కుమార్ తెలిపారు. ఓపెన్ ఇంటర్ పాసైన విద్యార్థులతో పాటు రెగ్యులర్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, రెండేళ్ల డిప్లమా కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సాదత్‌అలీ

దుబ్బాక: పట్టణ పరిధిలోని ధర్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సాదత్‌అలీ ఇన్నోవేటీవ్ టీచర్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో జటాధర ఎడ్యుకేషనల్ టెక్నాలజీ(జెట్) సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. వింగ్ కమాండర్ ఆంటోని చేతుల మీదుగా ఆయన అవార్డు, నగదు పురస్కారం అందుకున్నారు. కాగా సింపుల్ టాస్క్ గ్రేట్ కాన్సెప్ట్ ప్రయోగాలతో విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. ప్రయోగాత్మక బోధనను అందిస్తున్న సాదత్ అలీ కృషిని గుర్తించి ఇన్నోవేటీవ్ అవార్డును ప్రదానం చేశారు.

కలిసి ఉంటేనే గ్రామం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని ప్రజలందరూ కలిసి ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్ఐ రాజేశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కోరంపల్లి గ్రామంలో ఆర్ఐ సాయిశ్రీకాంత్‌తో కలిసి మానవహక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతిని పాటించరాదన్నారు. కుల,మతాలు, తారతమ్యం లేకుండా, అన్నదమ్ముల వలే కలిసి ఉండాలని సూచించారు. అందరికి ఆదర్శంగా ఉంటూ ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, హన్మంతు తదితరులు ఉన్నారు.

భవానీ మాత పడి పూజ

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని భక్తిధాం(బల్కంచెల్క) తండాలో మంగళవారం రాత్రి భవానీ మాత పడి పూజ వైభవంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, మహబూబ్ నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్‌సింగ్-లలిత దంపతుల ఆధ్వర్యంలో తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్ ప్రవచనం చేశారు. ఎంతుఓట రాములు, శంకర్, ఖత్రోత్ జైల్‌సింగ్, రాములు, రూప్‌సింగ్, కిషన్, సవాయ్‌సింగ్, మన్మోహన్ పాల్గొన్నారు.



మంజీరా పరీవాహక ప్రాంతాలను ముంచెత్తిన వరద

ఎన్నాళ్లీ ముంపు



చాల్కి గ్రామ శివారులో నీట మునిగిన పత్తి చేను



అమీరాబాద్ శివారులో నీట మునిగిన పత్తి

మంజీరా బ్యాక్ వాటర్‌లో మునిగిన పంటలు

- ప్రతి ఏటా వందలాది ఎకరాల్లో నష్టం
- పరిహారం అందించాలని కోరుతున్న రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): సాగు, తాగు నీటి కష్టాలు తీర్చే మంజీరానది పంటలను ముంచేస్తుంది. ప్రతి ఏటా ఈ నది బ్యాక్ వాటర్ వల్ల పరీవాహక ప్రాంతాల వెంట వందలాది ఎకరాల పంటలు నీటి పాలవుతున్నాయి. పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నష్టం వివరాలను సేకరించిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నా పరిహారం మాత్రం అందడం లేదని న్యాల్‌కల్ మండలంలోని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నాటక, మహారాష్ట్ర నుంచి ప్రవహించే మంజీరా నది న్యాల్‌కల్ మండలం గుండా జిల్లాలోకి ప్రవేశిస్తుంది. జిల్లాలో కురిసే భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానల వల్ల మంజీరాలోకి పెద్ద ఎత్తున వరద చేరుతుంది. వరదలు వచ్చినప్పుడల్లా బ్యాక్ వాటర్ వల్ల పరీవాహక ప్రాంతాలైన మండల పరిధిలోని హుస్సేన్‌నగర్, చాల్కి, అమీరాబాద్, చీకుర్తి, కాకిజన్‌వాడ, ముర్తుజాపూర్, రాఘవాపూర్ శివారుల్లో పంటలు నీట మునుగుతున్నాయి. ప్రభుత్వం గుర్తించిన దానికంటే అధికంగా భూములు ముంపునకు గురవుతున్నాయని, తమకు న్యాయం చేయాలని రైతులు ఫిర్యాదు చేయడంతో గత 15 ఏళ్ల క్రితం అధికారులు సర్వేలు చేశారు. కానీ ఇప్పటి వరకు దాని ఫలితాలు మాత్రం ప్రకటించలేదని తెలిపారు. ప్రతి ఏటా పంటలు నీట మునిగి తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు.

మంజీరాలోకి భారీ వరద

మంజీరా నదిలోకి ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. మూడు రోజులుగా వస్తున్న వరదల వల్ల నది పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునుగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు 500 ఎకరాల్లో పంటలు నీట మునిగింది. ప్రస్తుతం మంజీరాలో వరద ప్రవాహం పెరుగుతుండటంతో సుమారు వెయ్యి ఎకరాల వరకు పత్తి, సోయా పంటలు నీట మునిగినట్లు అధికారులు అంచనా వేశారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా చీకుర్తి గ్రామ సమీపంలో గల వంతెన నీట మునడంతో రాకపోకలను అధికారులు నిలిపి వేశారు.

పరిశీలించిన అధికారులు

చీకుర్తి గ్రామ సమీపంలో గల ఇళ్ల వద్దకు బ్యాక్ వాటర్ రావడంతో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, హద్నూర్ ఎస్ఐ సుజిత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రావు తదితరులు గ్రామాన్ని సందర్శించారు. ఇళ్ల వద్దకు చేరిన నీటిని పరిశీలించారు. మూడు కుటుంబాలను తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు.

పెట్టుబడి వచ్చేటట్టు లేదు..



నాకున్న రెండు ఎకరాలతో పాటు వేరే రైతులకు చెందిన నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశా. పక్కనే ఉన్న మంజీరా నదిలోకి చాలా నీరు రావడంతో పంటలు నీట మునిగాయి. రూ.50 వేలు పెట్టుబడి పెట్టా. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేటట్టు లేదు.

– రాజు రైతు, చాల్కి గ్రామం

ప్రాథమిక అంచనా వేశాం



మంజీరా బ్యాక్ వాటర్ వల్ల సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశాం. ముఖ్యంగా పత్తి, సోయా పంటలు నీట మునిగాయి. ప్రస్తుతం వరద ప్రవాహం కొనసాగుతుంది. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత క్షేత్ర స్థాయిలో పంట నష్టం వివరాలు సేకరిస్తాం.

– అభినాష్ వర్మ, మండల వ్యవసాయ శాఖ అధికారి, న్యాల్‌కల్

చెరువులో మునిగి వ్యక్తి మృతి



యాదగిరి

ములుగు(గజ్వేల్): ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో జరిగింది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు... గ్రామానికి చెందిన తోడేటి యాదగిరి(40)డ్రైవర్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే అతడు మద్యానికి బానిసై రోజు తాగుతున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతకగా గ్రామ బండ చెరువు వద్ద అతని చెప్పులు, దుస్తులు, బైక్ లభ్యమయ్యాయి. అనుమానంతో చెరువులోకి దిగి వెతకగా యాదగిరి మృతదేహం లభ్యమైంది.

మంజీరాలో దూకిన యువకుడు



లోక చంద్ర

సంగారెడ్డి: చౌటకూర్ మండలం శివంపేట వద్ద ఉన్న మంజీరా నదిపై గల బ్రిడ్జి పైనుంచి యువకుడు మంగళవారం నదిలో దూకాడు. ఆత్మహత్య చేసుకున్న దృశ్యాలు బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. జోగిపేటకు చెందిన అల్లే లోక చంద్రగా గుర్తించారు. అతడు గతంలో పలు వ్యాపారాలు చేసి నష్టపోయినట్లు తెలుస్తుంది. కొంత కాలంగా ఓ యూట్యూబ్ చానల్ పెట్టి నడిపిస్తున్నాడు. మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో క్షణాల్లోనే ఆ యువకుడు నీటి ప్రవాహంలో కొట్టుకొని పోయాడు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి



లక్ష్మీనారాయణ

నర్సాపూర్ రూరల్: మండలంలోని అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం, పీఆర్ టీయూటీఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మంగళవారం ఉదయం గుండెపోటు రావడంతో మృతిచెందాడు. దీంతో నర్సాపూర్ పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిని తెలుసుకొని స్థానిక ఎమ్మెల్యే సునీతా రెడ్డి, ఆయా పార్టీల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులు తరలివచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాయొల్లి వెంకయ్య

కొడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం ఎస్ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం ... మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన రాయొల్లి వెంకయ్య(67) స్థానిక పెట్రోల్‌బంక్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 28న ఉదయం విధులు ముగించుకుని 765డి జాతీయ రహదారిపై నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. కాగా అతన్ని వెనక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో తీవ్రగాయాలు అయ్యాయి. బాధితున్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయించి అనంతరం మంగళవారం గాంధీకి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

64 లీటర్ల మద్యం స్వాధీనం

నిజాంపేట(మెదక్): మండలంలోని కల్వకుంట గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్‌షాప్‌పై మంగళవారం పోలీసులు దాడిచేసి 64 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజేశ్ ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. బెల్ట్‌షాప్ నిర్వాహకులు నర్సాగౌడ్, దత్తాగౌడ్, బాలక్రిష్ణగౌడ్‌పై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

కొల్చారం(నర్సాపూర్): విద్యుత్ షాక్‌కు గురై రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో కొల్చారంలో జరిగింది. వివరాలు ఇలా... బాధితుడు ఎండుగుల దుర్గయ్య తనకున్న రెండు గేదెలను మేత కోసం గ్రామ శివారులోని పెరుమాండ్లకుంట వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మేస్తుండగా ఎల్‌టి లైన్ తెగిపడటంతో గమనించకుండా వెళ్లిన గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. గమనించిన బాధిత రైతు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపి వేశారు. రూ.లక్ష నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.



మృతి చెందిన పాడి గేదెలు

కుల గణన ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్: తాజాగా 2024 కుల గణన ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జీకే ఫంక్షన్‌లో లంబాడీల భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఖరారు చేయడం వల్ల గిరిజన సమాజానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కొంత మంది కాంగ్రెస్‌కు చెందిన గోండు, ఆదివాసీ నాయకులు బంజారులను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్రపూరితంగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారన్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా అక్టోబర్ 8న హుస్నాబాద్‌లో 10 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు భిక్షపతి నాయక్, హేమ నాయక్, తిరుపతి నాయక్, రాజు నాయక్, కృష్ణా నాయక్, మోహన్ నాయక్, హరియా నాయక్ ఉన్నారు.

చిన్నారిని చిదిమేసిన ట్రాలీ

సిద్దిపేట జిల్లాలో ఘటన



మనుశ్రీ

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తున్కిబొల్లారంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బక్కస్వామి నర్సింలు, సుప్రియ దంపతులకు చైత్ర, శ్రీనిధి, మనుశ్రీ ముగ్గురు కుమార్తెలు సంతానం. కాగా చిన్న కూతురు మనుశ్రీ(17 నెలలు) ఇంటి ముందు ఆడుకుంటుంది. ఈ క్రమంలో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసుకుంటూ అటువైపు వస్తున్న ట్రాలీ వాహనం డ్రైవర్ అజాగ్రత్త కారణంగా చిన్నారిని ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రెండు డీసీఎంలు ఢీ..

ముగ్గురికి గాయాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మునిగడప సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మర్కూక్ మండలం పాములపర్తి వద్ద పేడ లోడ్‌తో కొడకండ్ల వైపు వెళుతున్న డీసీఎంను సిరిసిల్ల నుంచి బట్టల లోడ్‌తో వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ మల్లేశం, లక్ష్మారెడ్డితో పాటు మరొకరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గజ్వేల్‌కు తరలించారు.

సేవాభావం.. ధర్మ రక్షణ



మాట్లాడుతున్న అమరేంద్ర ప్రసాద్

నంగునూరు(సిద్దిపేట): సేవాభావం, ధర్మ రక్షణ కోసం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పని చేస్తారని విశ్వహిందూ పరిషత్తు జిల్లా కార్యవాహ అమరేంద్ర ప్రసాద్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నంగునూరులో పదసంచాలన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల గుండా కవాతు నిర్వహించి ఆయుధ పూజ, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ విపత్తు సంభవిస్తే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సేవా భావంతో పని చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు అఖండ కార్యవాహ రాగుల వీరారెడ్డి, వెంకట్రామిరెడ్డి, రజినీకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘దాపటెద్దు’ పుస్తకావిష్కరణ



ఎద్దులు, రైతుల మధ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

నంగునూరు(సిద్దిపేట): అక్షర సేద్యం ఫౌండేషన్ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కవి బైతి దుర్గయ్య, బాలసాహితీవేత్త గరిపల్లి అశోక్ రాసిన దాపటెద్దు, అరుగుబడి పుస్తకాన్ని మంగళవారం ముంద్రాయిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పులి రాజు మాట్లాడుతూ.. రైతులే నిజమైన శాస్త్రవేత్తలని, వారి సుదీర్ఘ అనుభవం ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామస్వామి, లలిత, అశోక్‌కుమార్, నవీన్, అనిల్‌కుమార్, కవిత, సత్యలక్ష్మి, మల్లికార్జున పాల్గొన్నారు.

సాహిత్యంతోనే సమాజం ప్రభావితం

సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య వెంకట్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మనిషిని మనిషిగా తీర్చిదిద్దేది పద్యమేనని సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పద్యం వ్యక్తికి సంస్కారాన్ని, విజ్ఞానాన్ని, వివేకాన్ని ప్రసాదిస్తుందన్నారు. సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన శక్తి సాహిత్యానికి మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ అనురాధ, వీరారెడ్డి, రఘురామశర్మ, క్షేత్రం నిర్వాహకులు హరినాథ శర్మ, సింగీతం నరసింహారావు, సరస్వతి రామశర్మ పాల్గొన్నారు.

ఆలయంలో సినీనటుడు పూజలు



ఎల్‌బీ శ్రీరామ్‌కు చిత్ర పటాన్ని అందిస్తున్న చైర్మన్

దుబ్బాక: దుబ్బాక బాలాజీ ఆలయంలో సినీనటుడు ఎల్‌బీ శ్రీరాం మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో చేనేత కార్మికుల స్థితిగతులపై నిర్మిస్తున్న షాట్ ఫిలింలో నటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం చాలా అద్భుతంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీధర్, వేదపండితులు ఆయనను సత్కరించారు.

కొమురవెల్లి నుంచి బస్సులు నడపాలి

కేవీపీఎస్ జిల్లా నేత బాలకిషన్



వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గజ్వేల్‌రూరల్: కొమురవెల్లి నుంచి హైదరాబాద్‌కు బస్సులను నడపాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ కోరారు. జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో కంట్రోలర్ రామచంద్రంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి నుంచి కొండపోచమ్మ- జగదేవ్‌పూర్ మీదుగా ఈసీఐఎల్ వరకు, అదే విధంగా మునిగడప వయా తిమ్మాపూర్-రాయవరం-కొడకండ్ల-ప్రజ్ఞాపూర్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులను నడిపించాలని కోరామన్నారు. ఈ రూట్లో బస్సు సౌకర్యం కల్పించడం వల్ల భక్తులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఆయా రూట్లను పరిశీలించి బస్సులను నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని కంట్రోలర్ చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసు, సంపత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బిడ్డకు డీఎస్పీ ఉద్యోగం



కుమ్మరి శివరామనందన్

నారాయణఖేడ్: నిరుపేద కుటుంబంలో జన్మించిన రైతు కుమారుడు డీఎస్పీ ఉద్యోగం సాధించాడు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి శివరామనందన్‌గ్రూప్-1 ఫలితాల్లో ర్యాంకు సాధించి సత్తా చాటాడు. కుమ్మరి నర్సింహులు, మల్లమ్మలకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. వీరికి నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉండటంతో వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను పోషించారు. చిన్న కుమారుడు శివరామనందన్‌ప్రాథమిక విద్యాభ్యాసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువగా, 7వ తరగతి వరకు హన్మత్‌రావుపేటలో, 10వ తరగతి లింగంపల్లి గురుకులంలో చదివాడు. ఇంటర్మీడియెట్ శ్రీతేజ కళాశాలలో ఉచితంగా సీటు ఇవ్వడంతో పూర్తి చేశాడు. సేయింట్ ఆంటోనీస్‌లో డిగ్రీ పూర్తి చేసి, ఉస్మానియాలో ఎమ్మెస్సీ పూర్తి చేసి నాలుగేళ్ల క్రితం కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం పొందినప్పటికీ చెన్నైలో విధులు నిర్వహించాల్సి రావడంతో ఆగిపోయాడు. గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీ ఉద్యోగాన్ని దక్కించుకున్నాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నర్సాపూర్ రూరల్: ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన నర్సాపూర్ పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై రంజిత్ రెడ్డి వివరాల ప్రకారం... పట్టణంలోని శ్రీనివాస వైన్స్ వెనుక ఉన్న దుర్గాల మల్లేశ్ ఇంట్లో అద్దెకుంటున్న పెద్ద సురేశ్ ఇంటి తాళాన్ని గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి లోనికి వచ్చారు. బీరువాలోని రూ.65వేల నగదు, ఐదు తులాల వెండి పట్టీలను ఎత్తుకెళ్లారు. కాగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ బల్బు సరి చేస్తుండగా..

షాక్‌కు గురై రైతు మృతి



రాజమల్లయ్య మృతదేహం

దుబ్బాకరూరల్: విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రఘోత్తంపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రైతు కంతుల రాజమల్లయ్య(58) మంగళవారం తన కోళ్ల ఫారంలోకి కోడి పిల్లలను తీసుకు వచ్చాడు. సాయంత్రం వెళ్లి చూడగా విద్యుత్ బల్బు రాకపోవడంతో అక్కడే విద్యుత్(బుడ్డి)పై బల్బును కట్టెతో సరి చేస్తున్నాడు. దీంతో ఒక్కసారిగా బల్బుకు ఉన్న వైరు తెగి వచ్చి అతని మెడకు చుట్టుకుంది. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడ ఉన్న వ్యక్తి గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీంటి పర్యంతమయ్యారు.